లడ్డూ.. అదరహో!

బంజారాహిల్స్/ బోరబండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణపయ్య లడ్డూలు వేలం పాటలో అధిక ధరలు పలికాయి. వినాయకుడి చేతిలోని లడ్డూను కొనుగోలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. బంజారాహిల్స్, బోరబండ ప్రాంతాల్లో శనివారం రాత్రి లక్షలు వెచ్చించి లడ్డూలు కొనుగోలు చేశారు.



హెచ్‌ఎఫ్ నగర్ ఫేజ్-1 శ్రీసీతారామ భక్త సమాజం వారి మండపంలో రూ. 2,10లక్షలకు లడ్డూను దక్కించుకున్న మోనేశ్వర్. 17 ఏళ్లుగా గణపతి లడ్డూను ఆయనే స్వంతం చేసుకోవడం విశేషం



రహ్మత్‌నగర్ చౌరస్తా గణేష్ ఉత్సవ సమితి మండపంలో రూ. 3లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న సురేశ్ ముదిరాజ్



బోరబండ వినాయకరావునగర్‌లో రూ.1.20లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్న కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ మనవడు సాయికృష్ణ (టింకూ)




బోరబండ సైట్-3 కాలనీలో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశుడి లడ్డూను వేలంలో రూ.1.20లక్షలకు దక్కించుకున్న వీఎస్ సాయికుమార్



గౌతమ్‌నగర్‌లో సగర యూత్ ఆధ్వర్యంలో గణేశుడి లడ్డూను వేలంలో రూ.1.22లక్షలకు దక్కించుకున్న శివశంకర్ శైలజ దంపతులు



వినాయకనగర్‌లో బస్తీ కమిటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుడి లడ్డూను రూ.2లక్షలకు సొంతం చేసుకున్న బస్తీ అధ్యక్షుడు సంపంగి కిరణ్



బల్కంపేట బాబా ఫ్రెండ్స్, వరసిద్ధి వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న కాసాని నాగరాజు తదితరులు

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

- కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి

బంజారాహిల్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందని కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మి అన్నారు. రహ్మత్‌నగర్‌కు చెందిన జగన్‌నాయక్ ఏడు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం అతను ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి ఆదివారం అతణ్ణి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నియోజకవర్గంలో పేదలకు సాయం చేసేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపారు.



జగన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి

గుంతల రోడ్లకు మరమ్మతులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంతలమయమైన రహదారులకు అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. హైడ్రా అధికారుల ఆదేశాల మేరకు కృష్ణానగర్ బీ, సీ, డీ బ్లాక్‌లు, వెంకటగిరిలోని రహదారులకు మరమ్మతులు చేపడుతున్నట్టు వారు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు రోడ్లకు మరమ్మతులు చేపట్టడంపై స్థానిక నాయకులు లక్ష్మీరెడ్డి, రాధిక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లన్నీ గుంతలమయం



సాఫ్ట్‌వేర్ కార్యాలయం ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు
- చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు

హైటెక్ సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం వల్ల మాదాపూర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత ధ్వంసం కావడంతో రోజూ ఉదయం ఉద్యోగాలకు వెళ్లే వారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఇటు వైపు వచ్చే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.



గుంతలమయంగా అగ్నిమాపక కేంద్రానికి వెళ్లే రహదారి



ఫోనిక్స్ సమీపంలో కంకర తేలిన రోడ్డు

అధ్వానంగా రహదారులు..

సాఫ్ట్‌వేర్ కార్యాలయాలకు అడ్డాగా ఉన్న మాదాపూర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఆయా కార్యాలయాలకు వెళ్లే రహదారులు శిథిలమయ్యాయి. ముఖ్యంగా మాదాపూర్‌లోని అగ్నిమాపక కేంద్రానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. కార్యాలయం ముంగిటే పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. చిన్న వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలవడంతో పాటు ఎదురుగా ఉన్న ఐటీ కార్యాలయంలోకి వర్షపు నీరు వెళ్తుంది. గుంతలమయమైన రహదారిపై ప్రయాణించడంతో వెన్నునొప్పి వస్తుందని వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. అదే విధంగా వాహనాలు త్వరగా పాడవుతున్నాయని వాహన యజమానులు వాపోతున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సర్వీస్ వాహనాలు నిత్యం ఈ రహదారిపై ఇష్టారీతిగా వెళ్లడం కూడా ఒక కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుంతలయమైన రోడ్లలో ప్రయాణించలేకపోతున్నామని ఐటీ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామాన్య, పేద ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జీఎస్‌టీ స్లాబ్ ధరల తగ్గింపు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఫిలింనగర్‌లో ఆదివారం ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 28 శాతం ఉన్న జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో సామాన్యులు, పేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఆరోగ్య, జీవిత బీమాపై ఉన్న జీఎస్టీ పూర్తిగా ఎత్తేయడం వల్ల అందరి ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేసినట్టు అవుతుందన్నారు. ప్రపంచ పటంలో భారత దేశాన్ని అగ్రస్థానంలో ఉంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే కొనియాడారు. ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడి బోజిరెడ్డి, సెంట్రల్ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, నాయకులు నీరజ, గణేష్‌యాదవ్, దండుగుల శేఖర్, ముద్దంగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

చంద్రగ్రహణం.. మూతపడిన ఆలయాలు

బంజారాహిల్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం దేవాలయాలను ఆలయ అర్చకులు, అధికారులు మూసివేశారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకే మూసివేశారు. అదే విధంగా జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయం, ఫిలింనగర్ దైవసన్నిదానం, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 హరేకృష్ణ మూవ్‌మెంట్ స్వయంభూ లక్ష్మీనర్సింహ(స్వర్ణ) దేవాలయం, శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వర, భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజల అనంతరం మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని వారు తెలిపారు.

పోయిన పర్సు.. కేసు నమోదు

బంజారాహిల్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మఆలయంలో ఓ భక్తురాలు శుక్రవారం పర్సు పోగొట్టుకుంది. చిల్కూరుకు చెందిన కోలె శ్రీలక్ష్మి ఈ నెల 4న నగరానికి వచ్చారు. 6వ తేదీన జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయానికి వచ్చారు. పూజా సామగ్రి కొనుగోలు చేసి పర్సును తన సంచిలో పెట్టుకుంది. దర్శనం పూర్తయ్యాక వచ్చి చూడగా పర్సు కనిపించలేదు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పర్సులో రూ.30వేలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు చలో కలెక్టరేట్ : ఎమ్మార్పీఎస్

ముషీరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ తెలిపారు. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దశరథ్, ఎల్లయ్య, నర్సింగ్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు

- 108 ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్

అమీర్‌పేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వేడుకల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సేవలు అందించినట్లు 108 ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు. వినాయక నిమజ్జన వేడుకల్లో అంబులెన్స్‌ల పనితీరు పరిశీలించేందుకు ఆదివారం నాగేందర్ అమీర్‌పేటకు వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాయక నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని దోమలగూడ, ట్యాంక్‌బండ్ కింద, కవాడిగూడ సర్కిల్, ఎంజే మార్కెట్, లుంబిని పార్కు, బుద్ధ పూర్ణిమ, ఖైరతాబాద్, నాంపల్లి జంక్షన్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్, కాచిగూడ పోలీస్ స్టేషన్, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్, ప్యారడైజ్ సర్కిల్, నాగులచింత ఎక్స్ రోడ్, నల్గొండ ఎక్స్‌రోడ్, చంద్రాయణగుట్ట, మాసబ్‌ట్యాంక్ ఎక్స్ రోడ్, కార్మికనగర్ ఎక్స్ రోడ్, పురానాపుల్ ఎక్స్ రోడ్, మహారాజ్ ఎక్స్ రోడ్, మెహిదీపట్నం ప్రాంతాల్లో మొత్తం 20కి పైగా 108 అంబులెన్స్ వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నిమజ్జన వేడుకల్లో గాయపడిన వారి సమాచారం అందగానే సకాలంలో తమ సిబ్బంది స్పందించి వారికి ప్రథమ చికిత్స అందించడంతో పాటు సమీపంలోని ఆస్పత్రులకు చేర్చారని ఆయన తెలిపారు. తమ సేవలు విజయవంతం కావడానికి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ముఖ్య పాత్ర పోషించారని 108 ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ పేర్కొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ బలమైన ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని అధ్యక్షుడు ఐ.కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 8 గంటల పనిదినాన్ని పాటించాలని డిమాండ్ చేశారు. పని స్థలాల్లో రక్షణ కల్పించాలని అక్టోబరు 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరెట్ల ముందు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. అమెరికా అండతో ఇజ్రాయెల్, పాలస్తీనా భూభాగంపై సాగిస్తున్న దాడులను నిలిపివేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు జి. భారతి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల కర్నాటక యూనియన్ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు వెంకన్న, దాసు, శివబాబు, వెంకటేశ్వరరావు, అనురాధ, భూమయ్య, నరేష్, సారంగపాణి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం

బర్కత్‌పుర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం అని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని ఉత్తరాది మఠంలో జరుగుతున్న చతుర్మాస దీక్షల సందర్భంగా ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ శ్రీపాదుల స్వామీజీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ... ప్రపంచ దేశాలన్నీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైపు చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి సూర్యప్రకాష్‌సింగ్, బీజేపీ యువమోర్చా రాష్ట్రకార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఆవాజ్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

రాంనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆవాజ్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబ్బాస్ సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య, సాంస్కృతిక కార్యకర్తల సమావేశం టీపీఎస్‌కే, తెలంగాణ సాహితీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భవిష్యత్ ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందని అన్నారు. ఈ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. 1945 నుంచి 1951 వరకు సాగిన పోరాటాలలో సేకరించిన ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 15 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట పాటను పల్లెపల్లెకు తెలియజేయాలన్నారు. సాహితీ సంస్థ కార్యదర్శి కె.ఆనంద చారి, టీపీఎస్‌కే కార్యదర్శి కె.హిమబిందు మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి 31 వరకు జరిగే బతుకమ్మ పండగలో భాగంగా కవయిత్రుల వర్క్‌షాప్, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, శాంతారావు, భూపతి వెంకటేశ్వర్లు, రాములు, మోహన్‌కృష్ణ, సలీమా, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

దొంతి విశ్వనాథ్ లింగోజి స్మారక పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారిని గుర్తించి గౌరవించుకోవడం అభినందనీయమని వక్తలు అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఎలైట్ ఆధ్వర్యంలో నగరంలోని వేణుగోపాలనగర్ పాఠశాలలో దొంతి విశ్వనాథ్ లింగోజీ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్ పర్సన్ లయన్ డా.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా లయన్ చంద్రశేఖర్, సులేఖ, లయన్ దీపరాణి, లయన్ మహదేవ్, ముత్యాలు, లక్ష్మీకాంతరావు, రాహుల్, శ్రీనివాస్‌గుప్త, నర్మదా తదితరులు హాజరై పురస్కారగ్రహీతలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పుట్టిన ఊరును, తల్లిదండ్రులను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. దొంతి విశ్వనాథ్ లింగోజీ సేవలను స్మరించుకుంటూ వారి పేరిట అవార్డులను ప్రదానం చేయడం సంతోషకరమని అన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఈ తరం యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందన్నారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.



పురస్కార గ్రహీతలతో అతిథులు

గణేశుడి లడ్డూ వేలం



ఓల్డ్ బోయిగూడ ధన్‌కోటి వ్యాయామశాల వద్ద నెలకొల్పిన అద్వైత చ రాజ విఘ్నేశ్వరుడి లడ్డూను వేలంలో బీజేపీ రాంగోపాల్‌పేట్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్ లక్షా ముప్పై వేల రూపాయలకు దక్కించుకున్నారు. - రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



అడ్డగుట్ట కమ్యూనిటీ హాలు వెనుక వినాయక మండపంలో నిర్వహించిన వినాయక లడ్డూను వేలంలో రూ.65వేలకు దక్కించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త ఉప్పల కిషోర్. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



అడ్డగుట్ట శాస్త్రినగర్ బస్తీలో వినాయక లడ్డూను వేలంలో రూ.12 వేలకు దక్కించుకున్న బస్తీవాసి వరాలు. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం



గ్రహణం సందర్భంగా మూసివేసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం



గ్రహణం సందర్భంగా మూసివేసిన బోయినపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయం



గ్రహణం సందర్భంగా తాడ్‌బండ్ ఆలయాన్ని మూసివేసిన అధికారులు

చంద్రగ్రహణం.. లష్కర్‌లో ఆలయాల మూసివేత

సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్, మారేడుపల్లి, బోయినపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సికింద్రాబాద్‌లోని ఆలయాలను మూసివేశారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 8.30గంటలకు సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరిచి, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి వెల్లడించారు. కాగా సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులోని గణేష్ టెంపుల్, పెరుమాళ్ ఆలయం, పాండురంగవెంకటాద్రి విఠలేశ్వర స్వామి, కాశీవిశ్వనాధ ఆలయాలను మూసి వేసి బోర్డులు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక నివేదన పూజల అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తారని ఆయా దేవాలయాల ఈవోలు తెలియజేశారు.

- చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ తాడ్‌బండ్ దేవస్థానం మూసివేస్తున్నట్లు ఆలయం ఈఓ. నరేందర్ ప్రకటించారు. అదేవిధంగా బోయినపల్లిలో ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వరస్వామి ఆలయం, సీతారాంపురం శివ పంచాయతన ఆలయం, కంసారీబజార్‌లోని రాముల వారి దేవాలయం మూసివేసినట్లు సంబంధిత ఆలయాల పూజారులు తెలిపారు. అయితే సోమవారం తెల్లవారుజామున ఆలయాల శుద్ధి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతి ఇవ్వనున్నారు. మారేడుపల్లిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేశారు.



చంద్ర గ్రహణం దృష్ట్యా సికింద్రాబాద్ గణపతి దేవాలయాన్ని మూసివేస్తున్న దృశ్యం

బౌద్ధనగర్‌లో..

చంద్రగ్రహణం పురస్కరించుకుని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసి వేశారు. ఈ ఆలయాలు సోమవారం ఉదయం ఎనిమిది గంటల తర్వాత తెరుచుకోనున్నాయి. చంద్రగ్రహణం రాత్రి 9.52లకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున మూడు గంటల తర్వాత ముగిస్తుందని పండితులు తెలిపారు. నామాలగుండు కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, రామాలయం, బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం, చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంతో పాటు తదితర ఆలయాలను మూసి వేశారు. సోమవారం ఉదయం ఎనిమిదిగంటల తర్వాత ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత ఆలయాలు తెరుచుకుంటాయని ఆలయ అధికారులు, పండితులు తెలిపారు.



గ్రహణం సందర్భంగా మూసివేసిన మారేడుపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

- **జస్టిస్ బి.చంద్రకుమార్**

పద్మారావునగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల అందరిపై ఉందని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి సంఘీభావంగా ఆదివారం సికింద్రాబాద్ బోయగూడలోని నాలెడ్జ్ సెంటర్‌లో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు బన్నూర్ కొండారెడ్డి ఆధ్యక్షతన న్యాయవాదుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల తరపున ఎంపీలు అందరికీ ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని గెలిపించాలంటూ ఈమెయిల్స్ పంపాలని తీర్మానం పెట్టగా అందరూ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రెహమాన్, వేణుగోపాల్, ఏపీసీఎల్సీ నేత సురేష్, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ వాగేష్, గోవర్ధన్, సీనియర్ అడ్వకేట్ ప్రసాద్ బాబు, బి.వి.శేషగిరి, ఎంఎంసీఎస్ డైరెక్టర్లు తోర్నాల గిరి, ఆర్యుల మహేశ్వర్, హయత్‌నగర్ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, అడ్వకేట్లు శ్రీనివాస్, రవికుమార్, ఉమర్, నరేన్, రాజా, పట్లోల్ల జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్‌తో న్యాయవాదులు, జర్నలిస్టులు

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు పతకాల అందజేత

తార్నాక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సహకారంతో తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత వెయిట్ లిఫ్టింగ్ లీగ్ 2025-26 పోటీలను ఆదివారం లాలాపేట్‌లోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సీనియర్, యువత, జూనియర్ విభాగాల్లో 80 మంది మహిళా వెయిట్ లిఫ్టర్‌లు పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ డి.తిరుపతయ్య ఉత్తమ ప్రతిభ కనబర్చిన వెయిట్ లిఫ్టర్లకు పతకాలతో పాటు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రుతి వేణేపల్లి మాట్లాడుతూ ఈ లీగ్‌లో అర్హత సాధించినవారు త్వరలో బెంగళూరులో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఈ పోటీలు మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే కాకుండా, యువ క్రీడాకారిణులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు.



విజేతలకు పతకాలతో పాటు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ డి. తిరుపతయ్య తదితరులు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

రాంనగర్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్ల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ బలమైన ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్రస్థాయి సమావేశం అధ్యక్షుడు ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 8 గంటల పనిదినాన్ని పాటించాలని, పని స్థలాల్లో రక్షణ కల్పించాలని అక్టోబరు 6న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరెట్ల ముందు ధర్నా చేపట్టాలన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై భూభాగంపై సాగిస్తున్న దాడులను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, జాతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్, నాయకులు జి.భారతి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్కీమ్ వర్కర్ల కర్నాటక యూనియన్ అధ్యక్షుడు ప్రతాప్, నాయకులు వెంకన్న, దాసు, శివబాబు, ఎస్.వెంకటేశ్వరరావు, అనురాధ, భూమయ్య, నరేష్, సారంగపాణి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు



చిలకలగూడలో బందోబస్తుకు వచ్చిన పోలీసులతో ఏసీపీ శశాంక్‌రెడ్డి

ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు: ఏసీపీ

బౌద్ధనగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్లో పరిధిలో నిమజ్జనాలు ప్రశాంతంగా జరగటం సంతోషకరమని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం చిలకలగూడలో ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి బందోబస్తుకు వచ్చిన పోలీసులను, లోకల్ పోలీసులను ఆయన అభినందించారు. మండపాల నుంచి గణనాథులను నిమజ్జనానికి తరలించటంతో పోలీసులు కీలకపాత్ర వహించారని ఏసీపీ తెలిపారు. మండప నిర్వాహకులు, స్థానిక ప్రజలు, ఆయా విభాగాల అధికారులు పోలీసులకు సహకరించటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జనాలు ప్రశాంతంగా ముందుకు సాగాయన్నారు. పండుగ విజయవంతం కావటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి చిలకలగూడ డివిజన్ పోలీసుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి, రాంబాబు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌గౌడ్, పురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం



ఆదివారం సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 హెచ్ డిస్ట్రిక్ వారు టీచర్స్ డే ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా లయన్స్ గవర్నర్ గంప నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్న ఓల్డ్ గాస్మండిలోని ఆదయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మల నారాయణ రెడ్డి. - రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

నేడు చలో కలెక్టరేట్ : ఎంఆర్‌పీఎస్

ముషీరాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సంయుక్త ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు సోమవారం నిర్వహించే చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ కోరారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు పెన్షన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దశరత్, ఎల్లయ్య, నర్సింగ్‌రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

మహాకాళి దేవాలయంలో ఛండీ హోమం

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహాకాళి దేవాలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ఛండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకుడు వై.చంద్రమౌళి, భక్తులు హోమం, పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ పౌర్ణమిరోజు ఛండీ హోమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద పంపిణీ కేంద్రంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సమాజసేవలో ముప్పై ఒక్క సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆర్యవైశ్యులు అభినందనీయులని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. శనివారం నిర్వహించిన సామూహిక వినాయక నిమజ్జనాల సందర్భంగా సికింద్రాబాద్ మహాత్మాగాంధీ రోడ్డులో ఆర్యవైశ్య క్లబ్ సికింద్రాబాద్ వారు ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కేంద్రాన్ని ఆయన ఆదివారం తెల్లవారుజామున సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆర్యవైశ్య క్లబ్ పేదలకు ఉచితంగా బియ్యం, రోగులకు మందులు, అవసరమైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, అన్నదానాలు, ఇలా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, టీపీసీసీ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకల రామకృష్ణ, ఆర్యవైశ్య క్లబ్ అధ్యక్షులు మంచుకొండ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి సుబోధ్ గుప్తా, కోశాధికారి పెడకంటి రవిందర్ ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మోండా మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త

చెత్త తరలింపులో నిర్లక్ష్యం.. ప్రజల అవస్థలు

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్‌లో చెత్త డంపింగ్ కేంద్రాల వద్ద చెత్త తొలిగింపులో జీహెచ్‌ఎంసీ శాఖ నిర్లక్ష్యం వహిస్తుండటంతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త డంపింగ్ పాయింట్‌ల నుంచి సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా చెత్తను తరలిస్తున్నారు. జవాన్‌లను అడిగితే సాకులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మనోహర్ థియేటర్, హిల్‌స్ట్రీట్ స్కూల్, సెయింట్ మేరీస్ స్కూల్‌ల వద్ద ఉన్న చెత్తను మధ్యాహ్నం అయినా తొలిగించడం లేదు. ఇప్పటికైనా గతంలో మాదిరిగా ఉదయం 9 గంటల లోపు చెత్త తరలింపుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగిన వినాయక నిమజ్జనాలు







చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు



రాంగోపాల్‌పేట్: భక్తుల పూజలందుకుని ఆదివారం తెల్లవారుజామున నిమజ్జనానికి వినాయకసాగర్‌కు బయలుదేరిన రాణీగంజ్ కస్తూర్బానగర్ విఘ్నేశ్వరుడు



నెక్లెస్ రోడ్డులో నిమజ్జనానికై బారులు తీరిన వినాయకులు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శనివారం ప్రారంభమైన భాగ్యనగర్ సామూహిక వినాయక నిమజ్జనాలు ఆదివారం తెల్లవారిన తర్వాత కూడా పూర్తి కాకపోయే సరికి సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు పోలీసులు వినాయక వాహనాలను నెక్లెస్ రోడ్డువైపు మళ్లించారు. ఈ వాహనాలు పీవీ మార్గ్‌లోని అంబేద్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వరకు వచ్చి యూటర్న్ తీసుకుని తిరిగి పీపుల్స్ ప్లాజా వరకు వెళుతున్నాయి. దీనితో ఆ వైపునకు ఇతర ట్రాఫిక్ వెళ్లకుండా బారికేడ్లతో పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఈ వాహనాల్లో అధికశాతం మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచే కాక పాతబస్తీ వైపు నుంచి శనివారం బయలు దేరినవి ఉన్నాయి. దీనితో వాహనాల్లో ఉన్న భక్తులు ఆహార పానీయాలకు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బౌద్ధనగర్‌లో

చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన మండపాల నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లాయి. బౌద్ధనగర్, వారాసిగూడ, నామాలగుండు, టీఆర్‌టీ కాలనీ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో విగ్రహాలు ఆదివారం తెల్లవారుజామున ఐదుగంటల వరకు వెళ్లాయి. విగ్రహాలకు స్వాగతం పలుకుతూ ఆయా పార్టీ నాయకులు, భాగ్యనగర్ గణేశ్ సమితి స్వాగత స్టేజీలను ఏర్పాటుచేశారు. చిలకలగూడలో ఏవీకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేజీపై చిన్నారులు చేసిన కూచిపూడి నాట్యం పలువురిని ఆకట్టుకున్నాయి.



కొత్తచెరువు కొలనును పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్న అల్వాల్ సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్

అల్వాల్ కొత్త చెరువులో వ్యర్థాల తొలగింపు

అల్వాల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్త చెరువు కొలనులో తాజాగా వినాయకుల నిమజ్జనానికి సంబంధించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం తొలగించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది వ్యర్థాలను అక్కడి నుంచి వెంటనే తొలగించడంతో కొత్తచెరువు కొలను పరిసర ప్రాంతాలు ఆహ్లాదంగా మారాయి. గణపతి నిమజ్జన వ్యర్థాలను వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ సర్కిళ్ల వారీగా డీసీలకు ఇచ్చిన ఆదేశాలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏలు వెంకటేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.